
శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ – నవ్య వీక్లి కథల పోటీలో
విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

సముద్రం ఒడ్డునుంచీ నింగివంక చూస్తే అంతా నీలవర్ణ వైభవమే. ఆకాశం, నేల కలిసిన అర్ధనారీతత్వం. మధ్యలో ఓ మెరుపు మెరిస్తే విశాలమైన కాన్వాస్‌పై అదృశ్య చిత్రకారుడెవ్వరో వెలుగుల కుంచెతో దిద్దుతున్న ఫీలింగ్. ఇసుకతిన్నెలమీద కూర్చుని సముద్రం మీదుగా వచ్చే నీటిగాలి స్పర్శను అనుభూతిస్తూ ఆకాశం నేలకు అతి దగ్గరయ్యే ఆ చోటునుంచీ చూపు తిప్పకుండా ఆ దృశ్యాన్నే చూస్తున్నాడు కిషోర్.
అంతెత్తులో ఉన్న ఆ నింగిని అలా చూసినపుడల్లా... ఎక్కడో కిందనున్న నేలను అది మృదువుగా తాకి చుంబిస్తున్నట్లనిపిస్తుంది. ఆ అపురూప కలయికలో అరుణారుణ రాగాలు స్వరాలు సవరించుకుని అమర గాంధర్వాన్ని వినిపిస్తుంటే అలౌకికానందానుభూతితో పులకింతలకు లోనవుతున్నాడు. కలిసున్నట్లు కనిపించే ఆ నింగీనేల సహజీవన సౌందర్య రహస్యాన్ని విప్పి చెప్తున్నట్లుంది.
అదే సమయంలో కిషోర్‌లో చిన్న డౌట్. నిజంగా, నింగీనేలా కలిసున్నాయా? లేక, విడివిడిగా ఉంటూ కలిసున్న భ్రాంతి కలిగిస్తున్నాయా? ఎంత తర్కించుకున్నా కిషోర్‌కి జవాబు తట్టడం లేదు.

# లవ్...ప్యార్...మొహబ్బత్...!

పి.వి.డి.ఎస్. ప్రకాష్



విలీనంలో నింగీనేలా నీలవర్ణంతో ఒకటిగా కనిపిస్తూ... తాము ఒకటనే భ్రాంతి కలిగిస్తుండడంతో అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నాడతను. అలా ఆ రెండింటినీ కళ్లార్పకుండా చూస్తున్నపుడే... అతనికి హరిత గుర్తొస్తుంది.

అతనెపుడూ పఠించే వేద మంత్రం.
కిషోర్ అర్ధభాగం హరిత.
సమాజం దృష్టిలో వారిద్దరూ దంపతులు.
అయితే, తలుపులు మూసిన ఏకాంతసౌధంలో–
చేరువలోనే ఉన్నా చేరువకాని దూరం.

హరిత– అందనంత ఎత్తున అచ్చం అంబరంలా.

ఆమె పక్కన తాను... చేతులెంత సాచినా అందుకోలేని అట్టడుగు నేలలా...

బీచ్‌లో ఇసుక తిన్నెలమీద కూర్చుని... అలలతో పోటెత్తుతున్న నీలి సంద్రాన్ని చూస్తూ ఇపుడూ హరిత గురించే ఆలోచిస్తున్నాడు కిషోర్. ఎందుకో తెలీదుగానీ ఒక్కసారి అతని కళ్లు చెమర్చాయి. ఆ చెమర్చిన కళ్లవాకిళ్లలో పోటెత్తుతున్న కడలి కెరటాలు చెక్కిలి చెలియలికట్ట దాటేందుకు యత్నిస్తున్నాయి.

'హరిత'–

అతని ప్రణవం, ప్రణయం, సర్వం.

కలుసుకోవాలనుకున్నా కలవలేని భారం.

'ఎవరికివారే... యమునాతీరే!'

పెళ్లంటే గాలివానలో పూరిగుడిసెలాంటిదని... లోనున్నవాళ్లు వెలుపలికీ, వెలుపలున్నవాళ్లు లోనికీ రావాలనుకుంటారనీ... ఎక్కడో చదివింది ఇపుడు గుర్తొచ్చింది కిషోర్‌కి. తానూ అంతే... పూరిగుడెసెలో తలదాచుకుందామని లోనికి వెళ్లి బయటకు రాలేని పంజరంలో ఇరుక్కున్నాడు. హరితతో పరిచయం, స్నేహం, ప్రణయం, పరిణయం... ఒక్కొక్కటీ కిషోర్‌కి గుర్తొస్తున్నాయ.

పెళ్లంటే హరితలాటి అందమైన కలే. ఆ కలలో... కష్టంలో, సుఖంలో, కలతల్లో, కన్నీళ్లతో చేదోడువాదోడుగా, సగం సగంగా... అర్ధభాగం నిలుస్తుందని ఎంతగానో ఉవ్విళ్ళూరాడు.

కన్నీరై తడిసినపుడు చేరుమాలై, ఆనందమై ఎగిసినపుడు చిర్నవ్వయి అలరారుతుందనీ ఊహించాడు. అలసిపొలసి ఇంటికి వచ్చిన వేళ తన చీరకొంగుతో తడి స్వేదాన్ని తుడుస్తుందని భావించాడు.

అంతేకాదు, సాయం సమయ మసక చీకట్లో... పెరట్లో చుట్టుముట్టే సన్నజాజి పరిమళాల మాటున ఎదచాటు గుసగుసలు చెప్తుందని, అర్ధ

రాత్రి ఆదమరిచిన నిదురలో అక్కున చేర్చుకుని చీరకొంగులో చిన్నికృష్ణుడిలా దాచేస్తుందని... ఎన్ని అందమైన కలల గూళ్లు కట్టుకున్నాడో..?

ఎన్ని నిదురలేని రాత్రుల తపసు చేసాడో...?


ఊహించుకున్నకొద్దీ కన్నీరుమున్నీరవుతున్నాడు కిషోర్.

***

ప్రేమ–

అందంగా పుడుతుంది. అందంగా పెరుగుతుంది. కళ్ళూ కళ్లు కలసిన తొలిక్షణంలో లోకమంతా యవ్వనాల హోలీ అవుతుంది. ప్రేమలో పడిన క్షణంలో ఏదో తెలియని మైకం. ఆ మైకంలో సదా ఒకరి సన్నిధిలో ఒకరు గడపాలనే తపన, తాపత్రయం... అవే తన లోపాలు, అవే తన బలహీనతలు...!

'ఆ తర్వాత జీవితాన్ని అవే నరకప్రాయం చేస్తాయనడానికి తన జీవితమే



నిదర్శనం' అనుకున్నాడు కిషోర్ బాధగా.

హరిత–

కాళిదాసు శృంగార గీతిలా, అందాల గీతలా అలరిస్తూ ఉంటుంది. ఆల్చిప్పల్లాంటి కనుదోయిని అలవోకగా అటూ ఇటూ కదుపుతూ సరస సౌందర్య కావ్యాలెన్నిటినో తెరచి చెపుతుంది. అల్లరల్లరిగా సాగే అందమైన పాటని పైటగా చుట్టేసుకుని, అష్టపదులనే అడుగులుగా మలచుకుని ఆవిష్కృతమైన ఒకానొక అద్భుతం హరిత.

ఆమె సన్నగా కదిలితే... సన్నజాజి తీగె వయారంగా కదిలినట్లు, నవ్వితే మల్లెలు జలజలా రాలిపడినట్లనిపించేది కిషోర్‌కి. ఆమె కళ్ళెత్తితే చాలు కనకాభిషేకాలు.

హరిత... కిషోర్ ఎదురింటి అమ్మాయి.

హరితను చూస్తునపుడల్లా కిషోర్ మనసు వివశమయ్యేది. కురిసీ కురియని తెలిమంచులో కిటికీ తలుపులు తెరచీ తెరవగానే కుందనపుబొమ్మలా కూర్చుని చక్కని రంగవల్లికలు దిద్దుతూ కనిపించేది ఆమె.

ఆమె అలా కనిపిస్తేనే సుప్రభాతం.

చిర్నవ్వులు చిందిస్తే హిమపాతం.

పలకరిస్తే అమృత గీతం.

పలవరిస్తే... కలల జలపాతం.

అర్ధరాత్రివేళ ఆదమరిచిన నిదురలో, పగటి వేళ మెలకువలో కిషోర్ పెదవులు సదా పలవరించే ప్రణవాక్షరాలు ఆ మూడే.

హరిత–

హరిత–

హరిత–

***

ప్రేమలో పడ్డ తర్వాత ప్రతిరోజూ ఏకాంత సాయంత్రాల్లో ఎడతెగని కబుర్లే.

తాళిబంధంలో ఇంకా ఇరుక్కోనపుడు, భార్యాభర్తలుగా నెత్తిమీద అక్షింతలు వేసుకోనపుడు, దంపతులుగా తొలిరాతిరి ఏకశయ్య ఇంకా పంచుకోనపుడు.. ఎంచక్కని ప్రేమ బంధంలో క్షణాలు గడిపేస్తున్నప్పుడు... కొత్తగా ప్రేమలో పడ్డ వాళ్ళేం చేస్తారో... కిషోర్, హరితలూ అదే చేసారు.

ఏకాంత సంకేత స్థలాల్లో ఎదురుతెన్నులు.

ఒకరికొకరు కలుసుకునేదాకా యుగయుగాల ఎడతెరపిలేని నిరీక్షణ.

కలుసుకున్న మరుక్షణం నుంచీ అంతలోనే విడిపోతామనే అంతులేని దిగులు.

ఆ ఎదురు, బెదురుచూపుల వలయంలో కొన్నాళ్ళు–

కాదు, కాదు, కొన్నేళ్లు కొట్టుమిట్టాడారు.

కలిసున్న క్షణాల్లో మరింత దగ్గరగా కలసిపోవాలని... తపనపడ్డారు.

ఎదురుగా ఆమె కనిపిస్తుంటే... సొంతం చేసుకోవాలనే చిన్ని చిన్ని ఆశ.

దగ్గరగా, ఇంకా దగ్గరగా జరగాలని, కొద్దిగా తాకాలని, చెక్కిలి మీటాలని, బిగియారా కౌగిలించాలని, అదునుచూసి అమాంతం ఆమెని సొంతం చేసుకోవాలని ఒకటే 'ఇది'.

తేనె పంచదారల్లో ముంచినట్లుండే ఆమె అధర ఫలాలను కొంచెం కొంచెంగా కొరికి రుచిచూస్తూ... ఆమె చెప్పే తియతీయని కబుర్లు వింటూ... కిషోర్ స్థాణువై... వేణువై తన్మయంలో తేలియాడేవాడు.

చిర్నవ్వులతో మెస్మరైజ్ చేయడమే కాదు, చురకత్తులాంటి చూపుల్తో అల్లరి చేయకుండా అల్లంత దూరాన్నే ఉంచేది హరిత.

ప్రేమికులందరిలాగానే.. వాళ్ళూ థియేటర్ల చుట్టూ ప్రదక్షిణాలు చేసారు.

షికార్లంటూ పార్కుల చుట్టూ చక్కర్లు కొట్టారు.

మరిచిపోకుండా ఫిబ్రవరి ఫోర్టీన్ సెలబ్రేషన్స్‌ని జరుపుకున్నారు.

అందమైన పార్కుల్లో గిఫ్టులు ఇచ్చిపుచ్చుకున్నారు.

ఇప్పటికీ... తన సూట్ కేసు తెరచి చూస్తే...

అపుడెపుడో హరిత జడలోంచి జారిపడ్డ గులాబీ కనిపిస్తుంది లవ్ సింబల్‌లా. చాలాకాలమైంది కాబట్టి... కొన్ని రేకులు విడివడి కొద్దిగా ముకుళించినట్లనిపించినా ఎందుకో బయటపడేయడానికి అతనికి మనస్కరించడం లేదు. ఆ గులాబీతో పాటూ అప్పట్లో హరిత తాగి పారేసిన కూల్ డ్రింక్ మూతలు, తిని వదిలేసిన చాక్లెట్ రేపర్లు, జారవిడుచుకున్న రిబ్బన్లు, రబ్బర్‌బాండ్‌లు ఎన్నో ఉన్నాయి. అంతేకాదు... పాడువాటి ఆమె తలవెంట్రుకొకటి ఓసారి గుండెకు చిక్కుకుని ఇంటిదాకా వెంటాడితే... తీసి భద్రంగా దాచుకున్నాడు కిషోర్.

ముఖంపై మొటిమలు, నూనుగుమీసాలు వంటికి వయసొచ్చిన సంగతిని గుర్తు చేస్తే... ప్రేమ రాహిత్యంతో అలమటిస్తున్న మనసు... 'ఓ గాళ్ ఫ్రెండ్ కావాల'ంటూ గాఢంగా కోరుకుంది. అయితే ఆ గాళ్ ఫ్రెండ్ ఎదురింటి హరిత రూపంలో కనిపించింది. కవ్వించింది.

దాంతో, అతని ఊహలు ఆమె చుట్టూ గింగిరాలు తిరిగాయి.

ఆలోచనల బొంగరం ఆమె చుట్టూ ప్రదక్షిణాలు చేసింది.

'నేనూ ప్రేమలో పడ్డాను...' అనే ఒకానొక భావనే ఆలంబనైంది.

స్క్రీన్ మీద కనిపించిన లవర్స్ చెట్టాపట్టాలేసుకుని చెట్టూపుట్టా తిరుగుతూ ఎవరో రాసిన యుగళగీతాలు పాడుకున్నట్లు... హరితను వెంటబెట్టుకుని కిషోర్ తిరిగాడు.

ఆమె ప్రేమ మీద కవితలు చెప్పాడు.

ఆమె అంతే... కిషోర్‌ని ఎంతగానో పొగిడేది.

"గిఫ్టులెన్నో ఇచ్చిపుచ్చుకున్నా ప్రేమపూర్వకంగా మనసులు ఇచ్చిపుచ్చుకున్నామా?"

ప్రేమించామనుకున్నపుడు కలగని సందేహం... పెళ్లి తర్వాత, ఒకే కప్పు కింద కలిసి ఉన్న ఇన్నాళ్ళకి, ఇపుడు కిషోర్‌ని వేధిస్తోంది. వెంటాడుతోంది.

'అవును-నిజంగా మేమిద్దరమూ మనసిచ్చిపుచ్చుకున్నామా?' ప్రశ్నించుకుంటున్నాడు కిషోర్.

***

ప్రేమలో ప్రేమే తప్ప లోకం తెలీలేదు. పెళ్లిలో లోకం తప్ప ప్రేమే తెలీడం లేదు. ప్రేమికులు కాస్తా దంపతులవగానే సమస్యల వలయంలో పడిపోయారు. బాధల చట్రంలో ఇరుక్కుపోయారు. పెళ్లికి ముందు కిషోర్ అడగ్గానే సింగారించుకుని సినిమాలకొచ్చేది. ఇపుడు సినిమాలకూ షికార్లకు వెళ్లాలంటే... పర్సు పర్మిట్ చేయడం లేదన్న సంగతి గుర్తించి తటపటాయిస్తోంది. ఇంటద్దె కట్టడం, పాలవాడికి, పూలవాడికి, కిరాణాకి బాకీపడ్డం, ముప్పయ్ రోజులు గొడ్డులా కష్టపడ్డ తర్వాత అందే చిన్న మొత్తాన్ని రేపటిని తలచుకుంటూ పొదుపుగా వాడుకోవడం... ఇదే జీవితం కాదని ఇద్దరికీ తెలిసొస్తోంది.

ప్రేమలో ఉన్నపుడు చంద్రుడెరుగని పున్నమిరాత్రులెన్నో అనుభవంలోకి వచ్చేవి.

పెళ్లి తర్వాత చంద్రుడూ లేడు. పున్నమీ లేదు.

నీరవ నిశీధిరాత్రులు బలవంతంగా ఇంట్లో తిష్ట వేసాయి.

ఈ పరిస్థితి కిషోర్ తట్టుకోలేకపోతున్నాడు.

ఓ నిశ్శబ్ద చిత్రంలా ఎపుడూ మౌనముద్రలో హరిత–

కదలని ఓ శిల్పంలా కనిపిస్తూ.. కిషోర్ గుండెను కోసేస్తుంటుంది.

ఆమెనలా చూస్తుంటే కిషోర్‌కి భరించరాని బాధ కలుగుతుంటుందెపుడూ.

భరించలేని ఆ బాధని పంటిబిగువున బలవంతంగా దిగమింగుతుంటాడు కిషోర్.

"దోసెడు ఆశలు భళ్లున చేజారి బద్దలవగా.. కలత చెందిన ఎదతో కలల వెంట పరుగులెత్తే పయనమా? నీపేరే జీవితం?" అనుకుంటూ ఉంటాడతను నిస్సహాయంగా.

ఆలోచిస్తూ ఇంటికొచ్చిన అతడికి ఒక్కసారిగా నీరసం ఆవరించేసింది.


"భోంచేస్తారా?" అడిగింది హరిత.

ఆకలి వేస్తున్నా ఎందుకో ఆ రాత్రివేళ తినాలనిపించలేదు కిషోర్‌కి.

"ఊహూ....!"

మళ్ళీ నిశ్శబ్దం.

గుండెలు కోసేస్తూ.. చిత్రహింస పెడుతూ ఇద్దరి నడుమా మౌనం.




అది పెద్ద ఇనుపగోడలా, అతి బలంగా పేరుకుపోయింది.

ఆ నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టాలనే ఆసక్తి అసలు ఆమెలో లేనేలేదులా ఉంది.

లైటార్పి పక్కమీదకు దొర్లితే భయంకర నిశ్శబ్దానికి తోడు ఆ గదిని, తన మదిని అంధకారం అలముకుంది.

ఈ స్థితిని ఎలాగైనా అధిగమించాలి.

'ఎలా..ఎలా?' ఆలోచిస్తున్నాడు కిషోర్.

***

అంతరాత్రివేళా.... హరితకి నిద్రపట్టనట్టే ఉంది. బెడ్ మీద నెమ్మదిగా అటూ ఇటూ కదులుతోంది. ఆమెమీద చేయివేసాడు కిషోర్. ఆమె కిషోర్‌కి అభిముఖంగా తిరిగింది. నీలిరంగు బల్బు వెలుతురులో ఆమె ముఖం అరవిచ్చిన అరవిందంలా కనిపిస్తోంది. ఆమె చెక్కిలిపై వేలితో గుండ్రాలు చుడుతున్నాడు. తర్వాత... ఆమె అరుణారుణాధరాల మెత్తదనాన్ని స్పృశించాడు. ఆమె పైట సవరించుకుంటూ సమాయత్తమవుతోంది.

"రెండు శరీరాల వేడి తప్ప మన మధ్య ఇంకేమీ లేదా?" హరిత అడిగింది.

కిషోర్ బదులు చెప్పలేదు.

"నిద్రపట్టడం లేదా?" ఆమె అడిగింది.

"ప్రతిరోజూ"

"నాకూనూ..."

ప్రేమలో పడ్డ తొలినాళ్లలో ఆకలీ, నిద్రా దూరమయ్యాయి.

పెళ్లి చేసుకుని ఒకటయ్యాక కూడా ఇపుడూ అదే అవస్థ.

అప్పట్లో ఆరాటం.

ఇప్పట్లో.... ఇది పోరాటం.

"ఇవాళ మనసు విప్పి మాట్లాడుకుందాం. ఒకప్పుడు మనిద్దరం ప్రేమించుకున్నాం. కలవకుండా ఉండలేమనుకున్నాం. కలిసి బతకాలనుకున్నాం. పెళ్లి చేసుకున్నాం. ఇపుడేమైంది?" అతను అడుగుతున్నాడు.

"మన ప్రేమను పెళ్లి మింగేసిందా?" అసహనం వ్యక్తం చేసాడతను.

"రోజూ సాయంత్రాల్లో రహస్యంగా కలుసుకునే సమయాల్లోని ఉద్వేగాన్ని ఈ తాళి ఎగతాళి చేసిందా? ఇరవై నాలుగ్గంటల రోజులో ఓ ముప్పయ్ నిముషాలు... మహా అయితే మరో ముప్పయ్ నిముషాలు కలిసుండడంలోని ఆనంద తన్మయత్వం ఇపుడు కలిసుంటున్నపుడు చేదనిపిస్తోందా? ఈ అందుబాటుతనం కన్నా ప్రేమలో అరగంటపాటు కలుసుకునే దొంగచాటు థ్రిల్లే నయమనిపిస్తోందికదూ..."

హరిత మాట్లాడలేదు.

"మాట్లాడు హరితా... మౌనంగా ఉంటే లాభం లేదు. పెళ్లయి ఏడాది తిరక్కుండానే మనిద్దరికీ ఒకరకంటే ఒకరిపై వెగటు కలుగుతోందంటే... ఒకే కప్పు కింద ఇక నూరేళ్ల సహజీవనం ఎలా సాగించగలం? ఈ పరిస్థితికి ఎప్పటికైనా ఫుల్ స్టాప్ పెట్టా

ల్సిందేగా...'' కిషోర్ అడుగుతున్నాడు.

ఆమె అతని మాటలనే వింటోంది.

''హరితా...?''

అతన్నే చూస్తోంది.

''మనం ప్రేమించి పొరపాటు చేసామా? పెళ్లి చేసుకుని పొరపాటు చేసామా? ఒకే ఇంట్లో ఇద్దరుంటున్నా... ఎవరికివారే ఏకాంత ద్వీపాల్లా ఎందుకుంటున్నాం? ఒకే కప్పు కింద ముసుగేసుకున్న మనసులతో మనం ఆడుతున్న ఈ మాయనాటకానికి తెర దించేయాలి. కలసిబతికేంత ప్రేమ మనకు కరువైతే... విడిపోయే బతకడంలోని హాయిని అనుభవించొచ్చు. ఆనాటి ప్రేమ, ఆ ఎదురుచూపులు, ఆ ఏకాంత సాయంత్రాల్లో మనం గడిపిన అపురూప క్షణాలు, ఒకరంటే ఒకరు పడి చచ్చామనుకున్న అప్పటి అనుభూతులు... కేవలం ఆకర్షణేనా? నిజంగా మనం ప్రేమించుకోలేదా? ఒకరిపై ఒకరికున్న మోజుకీ, మోహాలకే ప్రేమ అని పేరు పెట్టుకున్నామా?'' అనలేక అనలేక ఆ మాటలంటున్నాడు కిషోర్.

అప్పటికి హరిత నోరు విప్పింది.

''కిషోర్. ఇపుడు నువ్వన్నవన్నీ నిజం. తరచి చూస్తే నాకూ అదే అనిపిస్తోంది. నిఝంగా మనం ప్రేమించుకోలేదు'' కిషోర్ ఒక్కసారి ఖంగు తిన్నాడు.

''అవును... మనమిద్దరం నిజంగా ప్రేమించుకోలేదు. అపుడు అందుబాటుతనమే మనల్ని కలిపింది. ఇపుడు అదే అందుబాటుతనం మనల్ని విడదీస్తోంది...''

''అందుబాటుతనమా?''

''అవును... అందుబాటుతనమే...''

''అంటే...'' అర్థం కానట్టు అయోమయంగా హరిత వేపు చూస్తున్నాడు కిషోర్.

''నా మాటలు వినడానికి కాస్త కఠినంగా ఉంటే ఉండొచ్చు. కానీ, వాస్తవం అదే. లవ్ చేయడానికి నాకో హృతిక్ దొరకలేదు.. ఎదురింట్లో ఉన్న నువ్వు తప్ప. అలాగే నీకూనూ... ప్రేమించడానికి ఏ హీరోయిన్ దొరకలేదు... నేను తప్ప. అందుకే, అందుబాటులో కనిపించిన ఒకర్నొకరం ఇష్టపడ్డాం. మొదట మాటలు కలిపాం. మనసులు కలిసాయనుకున్నాం. ప్రేమలో పడ్డామనుకున్నాం. కానీ, పీకల్లోతు అట్రాక్షన్‌లో పడిపోయాం. అన్నింటికీ అసలు కారణమేంటో తెలుసా? అదే అందుబాటుతనం. ఎస్.. నువ్వు కిటికీ తెరిస్తే... ఎదురింటి వాకిట్లో కల్లాపి చల్లుతూ, ముగ్గులేస్తూ, తలంటు పోసుకున్న తర్వాత కురులారబెట్టుకునేందుకు డాబామీద తిరుగుతూ నీకు నే కనిపించేదాన్ని. నాకూ అంతే! ఎక్కడ, ఏపని చేసినా ఎదురుగా నువ్వే కనిపించేవాడివి...''

ఆశ్చర్యపోతున్నాడు కిషోర్.

''అంతేనా...? టీవీ ఆన్ చేస్తే ప్రేమ.... థియేటర్‌కి వెళ్తే లవ్... కాలేజీకో, కాంపస్‌కో వెళ్తే కాదల్..... ఫ్రెండ్స్‌తో ముచ్చటిస్తే మొహబ్బత్... పార్కులోకి తొంగిచూస్తే జంటలు జంటలుగా డ్యూయెట్స్ పాడుతూ ప్యార్. అర్జంట్‌గా నేను ప్రేమలో పడిపోవాలనుకున్నాను. నువ్వు దొరికావ్... పడ్డాను. అంతే!''

'హరిత ఇలా కూడా మాట్లాడుతుందా?' అతను ఆశ్చర్యపోతున్నాడు.

''ఇన్నాళ్ళకి మనసు విప్పి మాట్లాడుతున్నాను కిషోర్...మిడిల్ క్లాస్ ఫామిలీ మాది. ఇంట్లో నాకు పెళ్లి చేయలేని ఫైనాన్షియల్ ప్రాబ్లెమ్స్... చికాకులు...ఇవన్నీ నీకూ తెలుసు..... వీటికి తోడు..... సినిమాల్లో, టీవీల్లో అదే పనిగా కనిపించే రంగురంగుల ప్రేమ.... ఎవర్ని ప్రేమించాలి? ఎదురుగా నువ్వు కనిపించావు. నువ్వు కాకుండా అక్కడ ఎవరున్నా అతడినే లవ్ చేసుండేదాన్ని...''

కిషోర్ కళ్లకి హరిత ఇపుడు కొత్తగా కనిపిస్తోంది.

''భోళాగా కనిపించే నిన్ను కవ్వించాను. స్పందించావు. నిన్ను ఎంకరైజ్ చేసాను. సాయంత్రాలు కలుద్దామన్నావు.... 'సరే' అన్నాను. సినిమాలన్నావు.. షికార్లన్నావు... 'బిల్లు నీది... థ్రిల్ నాదీ.' నీతో తిరగాను''

''అంటే...''

''అంటే... ఇంకా అర్థం కాలేదా? నే నిన్ను ప్రేమించలేదు. నాకు తెలుసు. నువ్వూ నన్ను లవ్ చేయలేదు.''

హరిత దగ్గర్నుంచీ ఆ ఆన్సర్ వస్తుందనుకోలేదు.

''నిజం చెప్పు... నువ్వు నన్ను నిజంగానే లవ్ చేసావా? ఒప్పుకోవడానికి నీ మగమనసు అంగీకరించకుంటే చెప్పక్కర్లేదులే...''

హరిత ప్రశ్న కొడవలిలా గుండెల్లోకి దిగి గాయం చేసింది. జవాబేం చెప్పాలి? నిజానికి, తనైతే ఏ ఈక్వేషన్స్ లేకుండా హరితను సిన్సియర్‌గానే లవ్ చేశాడు. ఇప్పటికీ ప్రేమిస్తున్నాడు. అయితే, హరిత ఒప్పుకోవడం లేదే. నేను ప్రేమించడం లేదంటోంది? నా ప్రేమను నిరూపించడం ఎలా? షాజహాన్‌లా మరో తాజ్ మహల్ కట్టాలా? బాధపడుతున్నాడు కిషోర్.

హరిత లేని లైఫ్ అర్థరహితమనే భావించాడు.

హృదయరాణిగా అపురూపమైన స్థానాన్నే ఇచ్చాడు.

అయితే, హరితేంటి? ఇలా మాట్లాడుతోంది.

కిషోర్ అచేతనుడే అయ్యాడు.

''సారీ.... ఇలాటి రోజొకటి వస్తుందని ముందే ఊహించాను. ఎప్పటికైనా ఒక్క నిజమైనా చెప్పాలిగా...''

ఓ క్షణం నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ మళ్లీ తనే– ''మరి, పెళ్లెందుకు చేసుకున్నావని అడగొచ్చు. ఆడపిల్ల పెళ్లి చేయలేని అశక్తతతో ఉన్న పేరెంట్స్‌కి మన సంగతి తెలిసింది. మొదట కాదన్నా... పిదప పరువు పోకుడదని చకచకా నీదగ్గరకొచ్చి పెళ్లి ఏర్పాట్లు చేసారు. అప్పట్లో వాళ్లకి ఈ నిజం చెప్పలేకపోయాను. అందుకే.. పెళ్లి ఊబిలో ఇలా ఇరుక్కుపోయాను...''

ఒక్కసారిగా హరిత వెక్కివెక్కి ఏడుస్తోంది.

ఆమెనెలా ఓదార్చాలో తెలీలేదు కిషోర్‌కి.

పైకి, హరితలా తను గుండె బాదుకుని ఏడ్వకున్నా గుండె బద్దలైపోతున్న తననెవరు ఓదారుస్తారు?

## ప్రేమ లుప్తమవుతోందన్న బాధతో..



నా అక్షరానికి ఓ మెచ్చుకోలు. నా కథకో ప్రయిజ్. న్యూ ఇయర్ తెచ్చిన గ్రీటింగిది. థాంక్స్‌టు నవ్య వీక్లీ.

'ప్రేమలో ప్రేమ తప్ప లోకం తెలీదు. పెళ్ళిలో లోకం తప్ప ప్రేమ తెలీడం లేదు.' ఇదీ నా కథలో నాయకుడి సంఘర్షణ. అందుబాటు తనంలోని ఆకర్షణే ప్రేమగా చలామణీ అవుతున్న నేపథ్యంలో ప్రపంచమంతా ప్రేమరాహిత్యంతో అల్లాడుతోంది. కాలేజీలో, కాంపస్‌లో, సుప్రభాతం నుంచీ సుషుప్తి వరకూ చానెల్స్‌లో, థియేటర్లలో కనిపించే ప్రేమ మనుషుల్లో, మనసుల్లో లుప్తమవుతోందనే బాధా తప్త హృదయంతో అక్షరీకరించిన కథ 'లవ్, ప్యార్, మొహబ్బత్..'


**–వి.వి.డి.ఎస్.ప్రకాష్,**

**12-11-297, వారాసిగూడ,**

**సికింద్రాబాద్**

**9000544160**


ఒక్కసారిగా, హఠాత్తుగా ఆమె పరాయిదానిలా అనిపించింది.

తాకడానికి కూడా మనస్కరించడం లేదు.

నిజానికి... హరిత కళ్లు వర్షిస్తుంటే చూడలేడు కిషోర్.

అదే మరో సిట్యుయేషన్‌లోనైతే దగ్గరగా తీసుకుని, హృదయానికి హత్తుకుని, భుజాలపై చేతులు వేసి 'నిన్ను కాపాడే కోటగోడలా నేను'న్నాననే భరోసా ఇచ్చి మరీ ఓదార్చేవాడు. కానీ, ఇవాళ అలా చేయలేకపోయాడు. కాదు, చేయలేకపోతున్నాడు.

''ప్లీజ్... కిషోర్! బిలీవ్ మి..నేనిన్ను లవ్ చేయలేదు. లీవ్ మి...నన్ను హర్ట్ చేయొద్దు...''

హరిత నోటవెంట ఆ మాటొచ్చాక కిషోర్ ఏం మాట్లాడలేకపోతున్నాడు.

అక్కడే, ఆ పరుపు మీదే మోకాలితో తల దాచుకుని అలా ఎంతసేపున్నాడో అతనికే తెలీదు.

తెల్లగా తెల్లవారిన తర్వాత హరితతో అతనన్న మాట ఒకటే.

''ఇక, మనం ఒకే కప్పు కింద కలిసుండలేం.'' ఆ మాటనేసరికి కిషోర్ గుండె బద్దలైంది.

''మనం విడిపోదాం....'' ఈ మాట మాత్రం అతని పెదవి గడపదాటి బయటకు రాలేదు. కానీ, అతని కళ్ల నుంచీ కట్టలు తెంచుకున్న కన్నీరు బయటకొచ్చింది.

*